సాక్షి వనపర్తి

సోమవారం, 9, అక్టోబర్, 2023



పచ్చని అందాల.. పీయూ

పాలమూరు యూనివర్సిటీ పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతుంది.

వివరాలు 8లో ▸



క్రీడాకారులకు ప్రోత్సాహం

గ్రామాల్లోని క్రీడాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /23.1

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్న సమయంలో కాస్త ఎండ తీవ్రత కనిపిస్తుంది. వర్షం కురవదు.

న్యూస్‌రీల్

హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా రవికుమార్



వనపర్తి: తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లికి చెందిన అడ్వొకేట్ రవికుమార్ నియమితులయ్యారు. ఇటీవలే ఆయన న్యాయవాది వృత్తిలో డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రవికుమార్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

అట్టహాసంగా ఇంతిజియా–23 వేడుకలు



పాలమూరు: పాలమూరు మెడికల్ కళాశాలలో ఆదివారం రాత్రి 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇంతిజియా–23 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3 నుంచి కళాశాలలో మెడికోలు ప్రత్యేక ఆటపోటీలు ఏర్పాటు చేశారు. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్ డాక్టర్ రమేష్ బహుమతులు అందించారు. ఆ తర్వాత విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ సినిమా పాటలకు నృత్యాలు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్, నవకల్యాణి, కిరణ్‌ప్రకాష్, ఇతర విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధన్వంతరి జయంతి ఉత్సవాలు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ధన్వంతరి జయంతి ఉత్సవాలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన నాయీబ్రాహ్మణ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణ కుల ఆరాధ్యదైవం ధన్వంతరి మొదటి ఆయుర్వేద వైద్యుడు అని, వైద్యం అంటే తెలియని రోజుల్లో ప్రపంచానికి ఆయుర్వేద వైద్యాన్ని కనుగొని పరిచయం చేసింది ఆయనే అన్నారు. గత ఎనిమిదేళ్లుగా జిల్లాకేంద్రాలతో పాటు ముఖ్య పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఇకపై మండల, గ్రామస్థాయిలోనూ పక్షం రోజుల వరకు ధన్వంతరి పండుగ ఎప్పుడైనా జరుపుకోవచ్చని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాములు, నారాయణ, కార్యదర్శి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి రఘు, ఉపకోశాధికారి బాలస్వామి, నాయకులు సత్తయ్య, వెంకటేష్, ఆంజనేయులు, శ్రీకాంత్, వాయిద్య కళాకారుడు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు'కు నీటి కొనసాగింపు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎల్లూరు గ్రామ శివారులో నిర్మాణం జరిగిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి లిఫ్టు వద్ద మొదటి పంపు నుంచి సాగు నీటి విడుదల కొనసాగుతుంది. ఆదివారం నాటికి 1.7 టీఎంసీల నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి డెలివరి సిస్టమ్ ద్వారా మొదటి పంపు నుంచి విడుదల చేస్తున్నారు. నీటి విడుదల కొన్ని రోజులు కొనసాగుతుందని డీఈ లోకిలాల్ తెలిపారు. పాలమూరు రెండో మోటారు పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. త్వరలో రెండో పంపును కూడా సిద్ధం చేస్తామన్నారు. ఈ వేసవిలో కేఎల్ఐ మొదటి లిఫ్టు వద్ద మరమ్మతులోని 5, 3 మోటార్లను కూడా రిపేరు చేసి సిద్ధం చేస్తామన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుకు తాగునీరు ఇవ్వడంతోనే మోటార్ల రిపేరు పనులు చేయలేకపోయామన్నారు. పాలమూరు ప్రాజెక్టు మొదటి పంపు నుంచి నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి 2 టీఎంసీల నీటిని నింపిన తర్వాతనే పంపును బంద్ చేస్తామన్నారు.



మత్స్యబీజం.. ఆలస్యం

చేపపిల్లల పంపిణీలో జాప్యం



చిన్నంబావి పరిధిలోని శ్రీశైలం వెనుక జలాల్లో చేప పిల్లలను వదులుతున్న కార్మికులు (ఫైల్)

- ఎదుగుదల కష్టమంటున్న మత్స్యకారులు
- జిల్లాలో 1,017 చెరువులు, కుంటలు
- లక్ష్యం 2.24 కోట్లు..

అమరచింత: గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదలడంతో ఆయా ప్రాంతాల్లోని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వర్షాకాలంలో ఉచితంగా చేప పిల్లలను అందజేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. ఉన్న కొద్దిపాటి నీటిలో చేప పిల్లలను వదిలి పెంచుకుందామని ఆశించిన మత్స్యకారులకు పంపిణీలో జాప్యం కావడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో 2.24 కోట్ల చేప పిల్లలను వదలాలని నిర్ణయించిన అధికారులు టెండర్లు నిర్వహించినా.. చిన్న సైజు పిల్లలు రావడం లేదని ఆలస్యం చేసినా, అధికారులు చివరకు వారి వద్ద ఉన్న పెద్ద సైజు చేప పిల్లలను జిల్లాలోని కొన్ని మండలాల్లో పంపిణీ చేసింది. మిగిలిన మండలాల్లో 20 రోజులుగా పంపిణీ చేస్తున్నారు.

20 రోజులుగా..

జిల్లాలోని పాన్‌గల్, పెద్దమందడి, కొత్తకోట, ఖిల్లాఘనపురం, మదనాపురం, ఆత్మకూర్ మండలాలతో పాటు అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ కుంటలో మాత్రమే సకాలంలో చేప పిల్లలను వదిలారు. మిగిలిన గ్రామాలు, మండలాల్లోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో 20 రోజులుగా చేపపిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. టెండర్ ప్రక్రియలో జాప్యంతో పాటు కార్యాలయంలో పనిచేసే పొరుగు సేవల సిబ్బంది సమ్మె కారణంగా ఆలస్యం జరిగిందని అధికారులు చెప్పుకొస్తున్నారు. చేప పిల్లలను రెండునెలల కిందటే పంపిణీ చేయాల్సి ఉన్నా అధికారులు ఆలస్యం చేయడంతో సకాలంలో ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేక నష్టపోయే ప్రమాదం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రస్తుతం 35 ఎంఎం నుంచి 40 ఎంఎం బొచ్చ, రోవు, బంగారు తీగల రకాలుండగా.. 80 ఎంఎం నుంచి 100 ఎంఎం బొచ్చ, రోవు, మెరిగల రకం చేప పిల్లలు ఉన్నాయి.

జిల్లాలో ఇలా..	మండలాలు	గ్రామాలు	చెరువులు, కుంటలు	మత్స్యకార సంఘాలు	సభ్యులు
	14	255	1,017	138	13 వేలు

ఎదుగుదల ఉండదు..



చేప పిల్లలను ఆలస్యంగా చెరువులు, కుంటల్లో వదలటంతో ఆశించిన స్థాయిలో ఎదుగుదల ఉండదు. రెండు నెలల కిందట వదలాల్సిన చేప పిల్లలను ఇప్పుడు వదిలితే అవి ఎప్పుడు పెరగాలి.. ఎలా విక్రయించాలో అర్థం కావడం లేదు. అధికారులు సకాలంలో చేప పిల్లలను మత్స్యకార సొసైటీలకు అందించాలి.

– వెంకటన్న, మత్స్యకారుడు, అమరచింత

అధికారుల నిర్లక్ష్యం..



మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రతిసారి కాంట్రాక్టర్లు నాసిరకమైన చేప పిల్లలు అందిస్తున్నారు. ఈసారి రెండునెలలు ఆలస్యం కావడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చినా.. అధికారుల అలసత్వం కారణంగా అన్యాయం జరుగుతోంది.

– గోపి, మత్స్యకారుడు, అమరచింత

15 రోజుల్లో పూర్తిచేస్తాం..



జిల్లాలోని మత్స్యకార సొసైటీలకు లక్ష్యం మేర చేప పిల్లలను సకాలంలో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. పొరుగు సేవల సిబ్బంది సమ్మె కారణంగా పంపిణీలో జాప్యం జరిగింది. 15 రోజుల్లో పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తాం.

– రహమాన్, ఏడీ, మత్స్యశాఖ



నేటికీ చేపపిల్లలు వదలని అమరచింత పెద్దచెరువు

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తోందని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండలం చిట్యాల క్రీడా ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్–14 బాలల వాలీబాల్ పోటీలను సర్పంచ్ భానుప్రకాష్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పోటీల్లో 13 బాలుర జట్లు, 5 బాలికల జట్లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓడినవారు నిరుత్సాహపడకుండా విజయం కోసం ప్రయత్నించాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందని.. నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో కొత్తకోట విజేతగా నిలవగా, రెండోస్థానంలో మదనాపురం, బాలికల విభాగంలో ఆత్మకూర్ విజేతగా నిలవగా.. రెండోస్థానంలో కొత్తకోట జట్లు నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఎంఈఓ శ్రీనివాసులుగౌడ్, జీహెచ్ఎం గణేష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేంధర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సాయిబాబా, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా సీనియర్ పురుష, మహిళా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్లు విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ సాధిక్అలీ, పీఈటీలు నాగరాజు, రాఘవేందర్, మేరిపుష్ప, కవిత, రాములమ్మ, సీనియర్ క్రీడాకారులు సన్నీ, పాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో శరత్‌చంద్ర తదితరులు

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి

ఆత్మకూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ములుగు జిల్లాలోని ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిందని.. ఆత్మకూర్‌ను కూడా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ ఆత్మకూర్ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు ఆదివారం ఏడోరోజుకు చేరాయి. ఆదివారం ఆమె దీక్ష శిబిరాన్ని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, కొత్తకోట సిద్ధార్థరెడ్డితో కలిసి సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఆరేళ్ల కిందట అఖిలపక్షం ఆధ్వర్యంలో 100 రోజుల పాటు దీక్షలు చేయగా అప్పటి ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు సీఎం కేసీఆర్‌తో డివిజన్ ప్రకటన చేయిస్తామని, న్యాయం చేస్తామని ఎన్నికల ప్రచార సభలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల మక్తల్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావు ఈ ఊసే ఎత్తలేదని.. మళ్లీ ఓట్లు దండుకొని మరోసారి మోసం చేసేందుకు పూనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని.. లేనిపక్షంలో మూడునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రానుందని, వచ్చిన వెంటనే డివిజన్‌గా ప్రకటింపజేస్తామని వివరించారు. అన్నిపార్టీలు, ప్రజా, కుల, యువజన సంఘాలను సంఘటితం చేసి ఆత్మకూర్‌కు జరిగిన అన్యాయంపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

స్తంభించిన రాకపోకలు..

ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ కాంగ్రెస్‌పార్టీ సాధన సమితి ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో రెండుగంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ప్రకటన వెలువడే వరకు ఉద్యమాన్ని దశలవారీగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరమేష్, నల్గొండ శ్రీను, రహమతుల్లా, వినయ్‌రెడ్డి, గాలిపంపు శ్రీను, డివిజన్ సాధన సమితి నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, ఖాజాపాషా, చిన్ననర్సింహ, జుబేర్, జావేద్, అజ్జపాగ లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణ, వెంకట్రాములు, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: తొమ్మిదేళ్ల కాలంలో వందేళ్లకు సరిపడా అభివృద్ధి పనులు చేశామని.. అండగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వనపర్తి నియోజకవర్గ ఓటర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగించేందుకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామని.. ఒక్క వనపర్తి నియోజకవర్గంలోనే లక్ష పైచిలుకు ఎకరాలకు సాగునీరు ప్రస్తుతం అందుతున్నట్లు వెల్లడించారు. మరో 25 వేల ఎకరాలకు నీరందించేందుకు వనపర్తి మండలం ఖాసీంనగర్ ఎర్రగట్టు ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో దక్షిణ తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. జిల్లాలో మెడికల్, ఇంజినీరింగ్, ఫిషరీస్, వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా నిర్మించబోయే ఐటీ టవర్ జిల్లాకు ఐకాన్‌గా నిలువనుందన్నారు. సాగునీటి రాకతో వలసలు ఆగిపోవటంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పాలమూరుకు పని కోసం వస్తున్నారని వివరించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని గమనించాలని.. విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందని.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంతోనే ప్రగతి సాధ్యమైందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వనపర్తి: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాన్‌గల్ మండలంలోని మల్లాయిపల్లి నుంచి సవాయిగూడెం వరకు రూ.2.10 కోట్లతో నిర్మించే 2.30 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, రూ.26 లక్షలతో భీమా కాల్వ నుంచి తిమ్మాయి చెరువును నింపే మినీ లిఫ్ట్, హైమాస్ట్ లైట్లు, చింతకుంటలో రూ.52 లక్షలతో నిర్మించిన అదనపు గదులను ఆయన ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, దావాజిపల్లిలో రూ.16 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ.2.70 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవన ప్రహరీ, అన్నారం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్సీ సామూహిక భవనాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, చివరి ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు అనూష, వెంకటయ్యయాదవ్, రాములు, ఎంపీటీసీలు రమాదేవి, లక్ష్మి, భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అడ్వొకేట్ రవికుమార్, అభిలాష్‌రావు, దేవేందర్ నాయుడు, దశరథనాయుడు, ఠాకూర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.



పంటకు తెగులు.. గొర్రెల పాలు...

గోపాల్‌పేట మండలం పొలికెపాడుకు చెందిన శ్రీశైలం యాదవ్ తనకున్న మూడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సుమారు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఎర్రదోమ తెగులు సోకడం.. రసాయన మందుల కొనుగోలుకు డబ్బులు లేక ఆదివారం పంటను గొర్రెల మేపునకు వదిలేశారు. వర్షాలు లేక పత్తి, వేరుశనగ పంటలకు సకాలంలో నీరందక తెగుళ్ల బారినపడి నష్టపోయామని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

– గోపాల్‌పేట

10న గద్వాలకు మంత్రి కేటీఆర్ రాక

గద్వాల రూరల్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 10వ తేదీన గద్వాలకు రానున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన వీడియో ద్వారా ప్రకటన చేశారు. గద్వాలలో నూతనంగా చేపట్టిన కొత్తబస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మెడికల్, నర్సింగ్ కాలేజీల భవన నిర్మాణాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక మార్కెట్‌యార్డులో బహిరంగ సభ ఉంటుందని సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కల్తీకి అడ్డుకట్టేది?

సాగులో పెరిగిన రసాయన ఎరువుల వినియోగం

- రైతులకు కొరవడిన అవగాహన
- భారమవుతున్న పెట్టుబడి.. ఏటా తగ్గుతున్న దిగుబడి
- నష్టాల్లో కూరుకుపోతున్న అన్నదాతలు



మదనాపురం మండలంలో పంటపై రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

మదనాపురం: ప్రస్తుత కాలంలో రైతులు పంటల దిగుబడి పెంచేందుకు రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. సులభతర పంటలు సాగు చేయడం.. తక్కువ సమయం కేటాయించడంతో అందుబాటులో ఉన్న రసాయన ఎరువులను పొలాల్లో చల్లి రైతులు ఇతర పనులపై దృష్టి సారిస్తున్నారు. గతంతో పోలిస్తే సేంద్రియ సాగు కంటే రసాయన ఎరువుల వినియోగం తప్పనిసరి అయింది. వినియోగించే ఎరువుల్లో కల్తీని గుర్తించేందుకు రైతులకు అవగాహన లేకపోవడంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువులు కొనేటప్పుడు, వినియోగించే సమయంలో గమనిస్తే కల్తీని గుర్తించవచ్చు.

ముఖ్యమైన అంశాలు..

ఎరువులు విక్రయించే దుకాణం ప్రభుత్వ గుర్తింపు పొందిందై ఉండాలి. కొనుగోలు చేసిన సమయంలో విధిగా రసీదు తీసుకోవాలి. నిర్దేశించిన కనీస పోషకాల శాతం తెలియకుండా ఉన్న ఎరువులను కొనుగోలు చేయకూడదు. సరైన తూకం ఉన్న ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనాలి.

గుర్తించడం ఇలా..

యూరియా పూర్తిగా నీటిలో కరిగి చల్లటి రంగులేని ద్రావణంగా మారుతుంది. అమ్మోనియం సల్ఫేట్ కొద్దిపాటి గోధుమరంగులోకి మారుతుంది. చల్లగా ఉండదు. డీఏపీ నీటిలో వేసి కలిపితే అడుగుకు చేరుతుంది. దీనికి నత్రికామ్లం వేస్తే అధిక భాగం మడ్డి కరిగి గోధుమరంగు ద్రావణంగా మారుతుంది. మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను నీటిలో కలిపితే కరిగి చల్లటి ద్రావణం ఏర్పడుతుంది. సల్ఫేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు నీటిలో కలిపితే కొంత భాగం మాత్రమే నీటిలో కరుగుతుంది. దానికి గడ సల్ఫ్యూరిక్ ఆమ్లం వేస్తే పూర్తిగా కరుగుతుంది. వివిధ సులభతర పరీక్షల ద్వారా ఎరువులు శుద్ధమైనవా లేక కల్తీవా అనేది గుర్తించవచ్చు. ఒకవేళ వ్యతిరేక ఫలితాలు వచ్చినట్లయితే కల్తీగా గుర్తించి వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం..



రైతులు సులభతరంగా వ్యవసాయం చేసేందుకు అలవాటు పడి రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట వినియోగిస్తూ పంటలు సాగు చేయడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే చాలా గ్రామాల్లో వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేయిస్తున్నాం. నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు సేంద్రియ సాగు పెరిగే అవకాశాలున్నాయి. మార్కెట్‌లో లభించే రసాయన ఎరువుల్లో కల్తీ లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. కల్తీ ఎరువులు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి. విక్రయించిన వారిపై కఠిన చర్యలకు ఫిర్యాదు చేస్తాం.

– రాజేంద్రకుమార్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మదనాపురం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

మక్తల్: జారిపడి తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే పట్టణంలో నేతాజీ నగర్ చెందిన మహాలక్ష్మి(52) గత నెల 29వ తేదీన ఇంట్లో ఉతికిన దుస్తులు ఆరవేసేందుకు వెళ్తుండగా కాలు జారి కిందపడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెంది. కూమారుడు మహేష్‌సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

మహిళ బలన్మరణం

అమరచింత: మానసికంగా ఆందోళనకు గురైన చాకలి సూజాత (49) ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త హోటల్ రాములు గతేడాది నవంబర్ 28న గుండె పోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిందని స్థానికులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: వ్యభిచారం నడుపుతున్న ఓ ఇంటిపై వన్‌టౌన్ పోలీసులు దాడులు చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ ఏరియాలోని ఓ ఇంట్లో వ్యభిచారం నడుపుతున్నారని వచ్చిన సమాచారంతో సీఐ సైదులు, ఎస్ఐలు నవీద్, సుధమాధురి కలిసి తనిఖీ చేశారు. ఆ ఇంట్లో ఇద్దరూ మహిళలు, ఒక వ్యక్తి పట్టుబడ్డారు. వారిని స్టేషన్‌కు తరలించడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీద్ వెల్లడించారు.

పెట్రోల్ బంక్ కార్మికుడిపై దాడి

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ సమీపంలో ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో పని చేస్తున్న కార్మికుడిపై గుర్తు తెలియని నలుగురు యువకులు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. చింతలపేట కాలనీకి చెందిన బుచ్చన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే రాత్రి 9:30 గంటలకు జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు యువకులు వారి బైక్‌కు పెట్రోల్ పోయించుకున్నారు. ఈ క్రమంలో నగదుకు సరిపడా పెట్రోల్ వేయలేదంటూ వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న నలుగురు పిడుగుద్దులతో చెలరేగారు. ఈ దాడిలో కార్మికుడు స్పృహతప్పి కిందపడ్డాడు. గమనించిన పెట్రోల్ బంకు నిర్వహకులు, స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కార్మికుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దాడిపై పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించేందుకు రంగంలో దిగారు. అయితే పోలీసుల అదుపులో ఒకరు, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి

అమరచింత: డీఎస్సీ–2023 పోస్టులు కొత్త జిల్లాల ఏర్పాటుతో తీవ్ర అన్యాయం జరిగిందని నిరుద్యోగ బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు మండల కేంద్రంలో ఆదివారం నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన 13,500 టీచర్ పోస్టులను ఈ డీఎస్సీలోనే కలిపి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అనుకుంటే ఉద్యోగాల సంఖ్య తగ్గిపోయిందన్నారు. కొన్ని జిల్లాల్లో రిజర్వేషన్లలో ఒకటి, సున్నా పోస్టులు ఉన్నాయన్నారు. సత్యందర్, కృష్ణమూర్తి, రాంచందర్ పాల్గొన్నారు.

పచ్చని అందాల.. పీయూ

- పచ్చదనంతో కళకళలాడుతున్న యూనివర్సిటీ
- ఆకట్టుకుంటున్న వివిధ రకాల పూలమొక్కలు
- గార్డెనింగ్, లాన్ నిర్వహణకు రూ.10 లక్షలు వెచ్చింపు
- మెడిసినల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆయుష్ అనుమతి
- న్యాక్ పర్యటన నేపథ్యంలో అధికారుల ప్రత్యేక చర్యలు



అంతర్గత రోడ్డు డివైడర్‌లో పెంచిన పూల మొక్కలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పచ్చని చెట్లతో కళకళలాడుతుంది. వర్షాకాలం కావడంతో క్యాంపస్‌లో ఎటు చూసినా పచ్చదనం అలుముకుని విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం పంచుతుంది. పీయూలోని ప్రతి కళాశాలలో ప్రత్యేక గార్డెన్లు, లాన్, పూల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చెట్లు ఏపుగా పెరగడంతో కుందేళ్లు, నెమళ్లు, కోతులు, అడవి పందులు, పిల్లులు, గుడ్లగూబలు వంటి అనేక రకాల జంతువులు, పక్షులు కనువిందు చేస్తున్నాయి. వీటి పరిరక్షణ కోసం 132 ఎకరాల్లో 2.3 కి.మీ., మేర అధికారులు ప్రహరీ నిర్మించడంతో బయటి వ్యక్తులు లోపలికి వచ్చేందుకు అవకావం లేకపోవడంతో ఆయా జీవులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి.



పీయూలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మెడిసినల్ ప్లాంట్ గ్రీన్‌హౌస్

ప్రత్యేకంగా గార్డెన్లు, లాన్లు..

పీయూలోని ప్రతి భవనం ఎదుట ప్రత్యేక గార్డెన్లు, లాన్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం టెండర్ ద్వారా ఏజెన్సీలను నియమించి ప్రతి సంవత్సరం రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, లైబ్రరీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంఈడీ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక గార్డెన్లు, వివిధ రకాల పూల మొక్కలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అలాగే పీయూ ముఖద్వారం నుంచి ఫార్మసీ కళాశాల హాస్టల్ వరకు దాదాపు కిలోమీటర్ మేర రోడ్డు మధ్య డివైెర్‌లో వివిధ రకాల పూల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా చెట్లు చల్లని నీడనిస్తున్నాయి.

మెడిసినల్ గార్డెన్‌కు అనుమతి..

పాలమూరు యూనివర్సిటీలో ప్రత్యేక జీవవైవిధ్యం నెలకొంది. వివిధ రకాల మెడిసినల్ మొక్కలు పెరుగుతున్న నేపథ్యంలో ఔషధపరమైన మొక్కలు పెంచేందుకు సెంట్రల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డు, మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్‌కు అధికారులు దరఖాస్తు చేయగా ఇటీవలే అనుమతులు లభించాయి. మెడిసినల్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే రూ.6 లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో దీనిని ప్రారంభించేందుకు ప్రత్యేక గ్రీన్ హౌస్ అధికారులు కొత్తగా నిర్మించనున్న రీసెర్చి ఫెసిలిటీ సెంటర్ వద్ద స్థలం కేటాయించారు. మరిన్ని నిధులను దశల వారిగా ప్రభుత్వం విడుదల చేయనుంది. దీన్ని ఏర్పాటు చేయడం వల్ల వివిధ విభాగాల విద్యార్థుల ప్రయోగాల కోసం ఎంతో ఉపయోగపడనుంది. వీటితోపాటు రెండుచోట్ల ప్రత్యేకంగా పలురకాల పండ్ల చెట్లను అధికారులు పెంచుతున్నారు. ఇందులో నేరేడు, జామ, దానిమ్మ, సీతాఫలం చెట్లను అధికంగా పెంచుతున్నారు.

సంరక్షణకు చర్యలు..



అంతర్గత రోడ్డు డివైడర్‌లో పెంచిన మొక్కలు

పీయూలో అనేక రకాలైన పక్షులు, జంతువులతో జీవవైవిధ్యం నెలకొంది. 132 ఎకరాల భూమిలో సగం భూమిలో రెండు గుట్టలు ఉన్నాయి. వాటిపై దట్టమైన చెట్లు ఉండడం, విపరీతమైన గడ్డి పెరగడం వల్ల మనుషులు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేనంతగా మారింది. దీంతో ఇక్కడ అనేక రకాలైన పక్షులు, జంతువులు నివశించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అలాగే జంతువులు, పక్షుల పరిరక్షణ కోసం ఎవరూ అటువైపు వెళ్లకుండా ప్రత్యేక బయోడైవర్సిటీ జోన్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గత రెండు సంవత్సరాల క్రితం పీయూలో రెండు లక్షల మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగాయి.

ఆహ్లాదకర వాతావరణం..



పీయూలో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సైతం పచ్చదనం ఉండేలా చూస్తున్నాం. కొంత అటవీ భూమి ఉండడంతో జంతువులు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. రీసెర్చ్ కోసం మెడిసిలన్ ప్లాంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర ఆయుష్ నుంచి అనుమతి వచ్చింది. భవిష్యత్‌లో ఎస్‌బీఐ వారి సహకారంతో పెద్దసంఖ్యలో మొక్కలు, పండ్ల చెట్లు పెంచేందుకు చూస్తున్నాం.

– లక్ష్మీకాంత్‌రాథోడ్, వీసీ, పీయూ

మెడిసినల్ ప్లాంట్‌కు అనుమతి



పీయూలో మెడిసినల్ ప్లాంట్ పెంచేందుకు నేషనల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డు నుంచి అనుమతి వచ్చింది. నిధులు సైతం మంజూర య్యాయి. అందుకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. వీటి ద్వారా మెడిసినల్ ప్లాంట్స్‌పై రీసెర్చ్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో మొక్కలు నాటితే ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ పొందాం. ఇదే స్ఫూర్తితో మరింత పచ్చదనాన్ని పెంపొందిస్తాం.

– పిండి పవన్‌కుమార్, అధ్యాపకులు, మైక్రోబయోలజీ

విద్యార్థులకు ఉపయోగం



ఎక్కడా లేని విధంగా విద్యార్థులకు పీయూ ఆహ్లాదకర వాతావరణంలో విద్యా బోధన అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దీని ద్వారా మంచి ఆరోగ్యం, ప్రశాంతంగా చదువుకునేందుకు దోహదపడుతుంది. ఎన్నో రకాల మొక్కలు, చెట్లు, పక్షులు, జంతువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పచ్చదనం పెంపొందించడానికి భవిష్యత్‌లో మరిన్ని చర్యలు తీసుకుంటాం.

– మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ సెట్

ఇథనాల్ కంపెనీతో మానవాళికి ముప్పు

హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

మరికల్: విష పదార్థాలను వెదజల్లే ఇథనాల్ కంపెనీ నుంచి భవిష్యత్‌లో మానవాళికి పెద్దముప్పుగా మారుతుందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. మండలంలోని చిత్తనూర్ వద్ద ప్రజాభిప్రాయాలకు వ్యతిరేకంగా నిర్మించిన ఇథనాల్ కంపెనీ ఎదుట ఆదివారం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల నుంచి బాధిత గ్రామాల ప్రజలు కంపెనీకి వ్యతిరేకంగా రిలే నిరవధిక దీక్షలు చేస్తున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా కూడా లేదన్నారు. రోజుకు 30 లక్షల లీటర్ల నీటిలో 18 లక్షల కిలోల బియ్యం ఉండకబెట్టి 40 లక్షల కిలోల విష పదార్థాలు బయటకు వదిలితే మన పరిస్థితి ఏమిటన్నారు. ఈ విష పదార్థాలను పక్కనే ఉన్న మన్నెవాగులో కలపడం ద్వారా ఈ నీళ్ల కృష్ణనదిలో కలిసి నదితీర ఉన్న గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కంపెనీ వల్ల భూమి, గాలి, నీరు కాలుష్యమైతే భవిష్యత్‌లో మన పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంపెనీ మూతపడే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇటీవల కంపెనీ నుంచి వస్తున్న విషా పదార్థాల కారణంగా చిత్తనూర్ గ్రామస్తులు వింత వ్యాధుల భారిన పడుతుండటమే కాకుండా నీటిలో ఉన్న జీవరాశులు మృతువాత పడుతున్నాయన్నారు. ఇక్కడ ప్రజల ప్రాణాలు, వ్యవసాయ భూములు, వాతావారణం బాగుండాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించి కంపెనీ మూతపెట్టాలని డిమాండ్ చేశారు.

తరలివచ్చిన గ్రామస్తులు..

ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని చేపట్టిన మహాధర్నాకు ఎక్లాస్‌పూర్, చిత్తనూర్, జిన్నారంతో పాటు చిన్నచింతకుంట, నర్వ మండలాల నుంచి ప్రజలు ర్యాలీగా వస్తూ కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు 1,500 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ బాబురావు, సెంట్రల్ యూనివర్సిటి ప్రొఫెసర్ రత్నం, రిటైర్డ్ ఐపీఎస్ ప్రభాకర్, రామారావు, రాఘవచారి, నాగార్జున లక్ష్మయ్య, మురళీ, మనివర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని పల్లా ఏరియాకు చెందిన సత్యనారాయణ చుట్టుపక్కల ఇళ్లలో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి వాహనంలో సింగారం రూట్‌లో తీసుకెళ్తుంటే ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పరిశీలించగా 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నందున డీటీ పంచనామా అనంతరం సత్యనారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కంసాన్‌పల్లి పులిగట్టులో చిరుత కలకలం

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లిలో ఆదివారం చిరుతపులి మేకలపై దాడి చేయడంతో రైతులు కంగుతిన్నారు. గతంలో కూడా ఓ మేకను చంపిందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తిరిగి ఆదివారం మధ్యాహ్నం మూడు చిరుతలు గ్రామ శివారులోని పులిగట్టు సమీపంలో రైతు మాణిక్యప్ప మేకలను మేపుతుండగా ఒక మేకపై దాడి చేయగా రైతుల కేకలకు పారిపోయినట్లు తెలిపారు. మేక అక్కడికక్కడే మృతి చెందింది. సర్పంచ్ గురునాథ్‌గౌడ్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోపాల్‌నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గట్టుపై గడ్డి ఉండటంతో జాడలు గుర్తించలేదని చిరుత పులితో పాటు దాని పిల్లలు ఉండొచ్చని తెలిపారు. రైతు మాణిక్యప్ప మేకను కోల్పోయినందుకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని చిరుత కనబడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

మైసమ్మ అడవిలో రోడ్డుదాటిన చిరుత

నవాబుపేట: మండలంలోని మైసమ్మ అడవి ప్రాంతంలో చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఆదివారం కొందుర్గు మండలానికి చెందిన వ్యక్తులు కారులో వెళ్తుండగా అడవిలోని మలుపు వద్ద చిరుత తాపీగా నడుస్తూ కనిపించినట్లు తెలిపారు. చిరుత మైసమ్మ దేవాలయం దారి నుంచి పిల్లల మర్రి దారి వైపు అడవిలో రోడ్డు దాటింది. ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలని, రాత్రివేళలో ఈ దారిలో ప్రయాణాలు మానుకోవాలని పోలీసులు సూచించారు.



మైసమ్మ అడవిలో రోడ్డు దాటుతున్న చిరుత

ఎమ్మెల్యే మర్రి యాత్రకు అడ్డంకులు

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి చేపట్టిన పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రన్న యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఆదివారం ఆయన మండలంలోని వట్టెంలో యాత్ర ప్రారంభించగా కాంగ్రెస్ నాయకులు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలో యాత్రను అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు కల్పించుకొని సర్దిచెప్పారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులకు అన్యాయం చేశారని, సరైన పరిహారం ఇవ్వలేదని నినాదాలు చేశారు. అనంతరం యాత్ర కారుకొండకు చేరుకుంది. ఈ క్రమంలో పాతశాల భవనం విషయమై ప్రశ్నించడానికి వచ్చిన సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ భర్త మల్లేష్‌లను పోలీసులు అడ్డుకుని యాత్ర ముగిసే వరకు నిర్బంధించారు. తర్వాత వసంతాపూర్‌లో యాత్ర ముగించుకుని గుడ్లనర్వకు వస్తున్న మర్రి జనార్దన్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లగా ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు ఎమ్మెల్యే మర్రిని కారులో నుంచి బయటికి తీసుకొచ్చి గ్రంథాలయ సంస్థల చైర్మన్ హన్మంతురావు కారులో గుడ్లనర్వలో నిర్వహించే యాత్రకు తీసుకెళ్లారు. అయితే సదరు వాహనంపై గుడ్లనర్వలో కొందరు రాళ్లతో దాడి చేయడంతో అద్దాలు పగిలిపోయాయి. ఎమ్మెల్యే మార్నింగ్ వాక్‌లో చేసిన హామీలు, దళితబంధుపై ప్రశ్నించడానికి కొందరు యువకులు రాగా.. ఎమ్మెల్యే మర్రి ఎదుటే బీఆర్ఎస్ నాయకులు వారిపై దాడి చేశారు. పోలీసులు కల్పించుకొని వారిని అక్కడి నుంచి పంపించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మోహన్‌కుమార్ ప్రత్యేక బృందాలతో గుడ్లనర్వ చేరుకున్నారు. అయితే కారుకొండలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లో నాకన్నా ఎక్కువ కొట్లాడే మొగోడు ఎవడూ లేడంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.



గుడ్లనర్వలో ప్రశ్నించడానికి వచ్చిన వ్యక్తిపై దాడి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రసం పీల్చే పురుగును నివారిద్దాం



సాగు చేసిన పత్తి పంట

పత్తి పంటలో బొట్టు పెట్టే పద్ధతి

అలంపూర్: పత్తి పంట సాగులో ముఖ్యంగా బీటీ పత్తిలో రసం పీల్చే పురుగు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. అన్ని ప్రైవేట్ కంపెనీలు విత్తన శుద్ధి చేస్తారు. విత్తన శుద్ధి వలన మొదటి 20 రోజుల వరకు పత్తి మొక్కలకు రసం పీల్చే పురుగులను తట్టుకోనే శక్తి ఉంటుంది. ఆ తర్వాత వివిధ ఖరీదైన మందులు పిచికారి చేసే బదులు తక్కువ ఖర్చుతో కాండానికి మందు పూసి లేదా బొట్టు పెట్టి పురుగులను నియంత్రించవచ్చునని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు వివరించారు.

ఎలా చేయాలి

ఒక వంతు మోనోక్రోటోపాస్ మందు తీసుకుని దానికి నాలుగు వంతుల నీరు కలపాలి. ఉదాహరణకు 100 మి.లీ. మోనోక్రోటోపాస్ మందు తీసుకుంటే 400 మి.లీ. నీరు కలపాలి.

- ఈ మందు మిశ్రమాన్ని వేప పుల్లతో లేదా కాండానికి మందు పెట్టే బ్రష్‌తో మార్కెట్‌లో లభిస్తుంది. మొక్క కాండంపై ఎరుపు రంగుపైన లేత ఆకుపచ్చగా ఉన్న కాండంపై పూతగా బొట్టు పెట్టాలి.
- ఇలా 20 రోజుల వ్యవధిలో రెండు మార్లు చేస్తే పత్తి పంటను 60 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయకుండానే కాపాడుకోవచ్చును. అంటే నాటిన 20, 40, 60 రోజులకు ఒకసారి ఈ పద్ధతి పాటించాలి.
- అవసరాన్ని బట్టి వేప కషాయం 5 శాతం లేదా వేప నూనె (1,500 పీపీఎం) మందును లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్లు కలిపి సాయంత్రం సమయాల్లో పంటపై పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు.

ఈ రెండు విధానాలను పాటించడం వలన కీడు చేసే పురుగులు నశించి మేలు చేసే మిత్ర పురుగులు బతికి ఉంటాయి. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట చేతికి వస్తుంది.

బొట్టు పద్ధతి వలన లాభాలు

- పెట్టుబడి తగ్గుతుంది. మిత్ర పురుగులు చనిపోకుండా ఉంటాయి. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది.
- రసం పీల్చే పురుగులను బాగా నియంత్రించవచ్చును.
- పెట్టుబడిలో పురుగు మందుల ఖర్చు తక్కువగా ఉంటుంది.

కాంగ్రెస్‌లో మళ్లీ లొల్లి

ఢిల్లీ వార్‌రూంకు చేరిన పంచాయితీ

- హస్తినలో ధర్నాకు దిగిన గద్వాల కాంగ్రెస్ నేతలు
- జెడ్పీచైర్‌పర్సన్ సరితకు టికెట్ ఇవ్వొద్దంటూ ప్లకార్డు ప్రదర్శన
- అధికార పార్టీకి కోవర్టుగా వ్యవహరిస్తుందంటూ తీవ్ర ఆరోపణలు
- ఎమ్మెల్యే టికెట్ విద్యార్థి సంఘం నేతలకు ఇవ్వాలని డిమాండ్



ఢిల్లీలో వార్‌రూం వద్ద ధర్నా చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కుర్వ విజయ్‌కుమార్, వర్గీయులు

గద్వాల రూరల్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య లొల్లి రాజుకుంటూనే ఉంది. తాజాగా ఆ పంచాయితీ ఢిల్లీ వార్ రూంకు చేరింది. టికెట్ కేటాయింపుల ప్రక్రియ తుది దశకు చేరడంతో.. ఇప్పటి వరకు గద్వాల, హైదరాబాద్ వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు, నిరసనలు చేసిన నేతలు తాడోపేడో తేల్చుకునేందుకు ఏకంగా హస్తినకు చేరడం, ధర్నా చేపట్టడం గమనార్హం. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అధికార బీఆర్ఎస్ పార్టీ కోవర్టుగా వ్యవహరిస్తుందని, ఆమెకు టికెట్ ఇవ్వొద్దని, పార్టీకి విధేయులుగా ఉన్నవారికి టికెట్ ఇచ్చి గద్వాలలో కాంగ్రెస్‌ను కాపాడాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శించడం పెద్దఎత్తున చర్చనీయంశమైంది.

ఆది నుంచి అదే తీరు

జెడ్పీచైర్‌పర్సన్ సరిత మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ గద్వాల టికెట్ ఆశించి తనకంటూ వర్గాన్ని ఏర్పర్చుకొంది. దీంతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ వర్గాలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు కొనసాగాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ పర్యటనలో జెడ్పీ చైర్‌పర్సన్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం, సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్లు కేటాయిస్తారనడంతో జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బంధువైన బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, మరికొందరు నాయకులతో కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే, అప్పటికే గద్వాల నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ వస్తున్న డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, కుర్వ విజయ్‌కుమార్, వీరబాబు, బలిగెర నారాయణరెడ్డికి ఇది మింగుడు పడలేదు. గద్వాలలో గత నాలుగేళ్లుగా అధికార పార్టీ నిర్బంధాలను ఎదుర్కొని పలు రకాల ప్రజా సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్న తమను కాదని సరితకు టికెట్ ఎలా ఇస్తారని ఎదురుతిరిగారు. ఈ నేపథ్యంలో వీరి మధ్య వర్గ విభేదాలు ఏర్పడ్డాయి. ఈ ఐదుగురు నేతలు ఓ వైపు.. సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మరోవైపుగా రెండు వర్గాలుగా విడిపోయారు.

పార్టీ పెద్దల వరకు..

రెండు వర్గాలుగా విడిపోయిన నాయకులు పాత వర్గీయులైన డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, కుర్వ విజయ్‌కుమార్, వీరుబాబు, రాజీవ్‌రెడ్డి.. జెడ్పీ చైర్‌పర్సన్ సరితపై బహిరంగ వేదికలపై సంచలన ఆరోపణలు గుప్పిస్తూ విమర్శలకు పాల్పడ్డారు. బీఆర్ఎస్‌కు కోవర్టుగా పనిచేస్తుందని, వనపర్తికి చెందిన ప్రభుత్వ పెద్ద అండదండలు పుష్కలంగా ఉన్నాయని, పార్టీ టికెట్‌పై గెలిచిన మరుక్షణమే తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతారంటూ సోషల్ మీడియా, ఫ్లెక్సీల రూపంలో విమర్శలు, ఆరోపణలు చేశారు. పలుమార్లు అధిష్ఠానంతోపాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేను కలిసి ఫిర్యాదులు చేశారు. ఈ ఆరోపణలపై జెడ్పీ చైర్‌పర్సన్ మౌనం వహిస్తూ తనకే టికెట్ వస్తుందని ప్రజల్లోకి వెళ్తూ ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్పిస్తూ తనదైన శైలిలో ముందుకెళ్లారు. జిల్లాలో తాము చేపడుతున్న కార్యక్రమాల గురించి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రేను కలిసి వివరించడంతోపాటు తమపై చేస్తున్న ఆరోపణలు, వ్యతిరేక ప్రచారాన్ని కూడా జెడ్పీచైర్‌పర్సన్ ఆయనకు వివరించారు.

బలప్రదర్శన షురూ..

గద్వాల కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా ఏర్పడిన ఈ నాయకులు ఎవరికి వారే.. యమునా తీరే అన్న తరహాలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ బలప్రదర్శనలకు దిగుతున్నారు. పార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన పీవీ మోహన్ ఎదుటే రెండు వర్గాల నాయకులు పలుమార్లు వాగ్వాదం, బాహాబాహీకి దిగారు. గద్వాల పట్టణంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో కుర్వ విజయ్‌కుమార్, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరు కూడా ఘర్షణకు దిగి ఒకరినొకరు తోసుకోవడం వివాదాస్పదమైంది. ఇదంతా కూడా పార్టీ ఇన్‌చార్జ్ పీవీ మోహన్ సమక్షంలోనే జరగడం విశేషం.

పార్టీని కాపాడాలని..

పాత, కొత్త వర్గం నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు తాజాగా ఢిల్లీ వార్‌రూం చేరాయి. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కుర్వ విజయ్ కుమార్ నేతృత్వంలో వర్గీయులు ఢిల్లీలోని వార్‌రూం గేట్ ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. సరితకు టికెట్ ఇవ్వొద్దంటూ, విధేయులుగా పనిచేసే వారికి ఇచ్చి గద్వాలలో పార్టీని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన నేత రాహుల్‌గాంధీకి విన్నవించారు. అలాగే తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమనాయకులైన విద్యార్థి సంఘం నాయకులలో ముగ్గరికి అసెంబ్లీ టికెట్ ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని, గద్వాల అసెంబ్లీ టికెట్‌ను తనకు కేటాయించాలని టీపీసీసీ కార్యదర్శి కుర్వ విజయ్ కుమార్ కోరడం హాట్‌టాపిక్‌గా మారింది. గద్వాలలో రెండు వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు ఎలా సద్దుమణుగుతాయో వేచిచూడాల్సి ఉంది.

బండారు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్తా

- అతడిలాంటి చీడపురుగుల్ని ఏరివేయాలి: మంత్రి రోజా



మొగ్గలరాజపురం (విజయవాడ తూర్పు): టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి తనపై చేసిన వాఖ్యలపై సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయపరంగా పోరాడతానని ఏపీ మంత్రి ఆర్.కె.రోజా చెప్పారు. బండారు లాంటి చీడపురుగులను ఏరిపారేయాలంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను ఒకమాట అనాలంటే భయపడే పరిస్థితి రావాలన్నారు. చైనాలో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో టెన్నిస్ మెన్స్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన మైనేని సాకేత్‌ను ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. స్కిల్ కుంభకోణంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబునాయుడును సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడంతో టీడీపీ వారికి పిచ్చెక్కి ఎవరిని తిడదామా.. అని ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ నుంచి లాయర్లు వచ్చినా చంద్రబాబును జైలు నుంచి బయటకు తీసుకురాలేకపోతున్నారని పేర్కొన్నారు. బండారు సత్యనారాయణమూర్తి తన నియోజకవర్గంలోని, ఇంట్లోని మహిళలకు ఏవిధమైన విలువ ఇస్తారో బహిర్గతమైందని చెప్పారు. తనకు ఊహ తెలిసినంతవరకు ఎవరూ ఇంతలా ఒక మహిళ గురించి మాట్లాడలేదన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

మరిన్ని ఏపీ వార్తలకు
ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

లక్ష్యం.. క్లీన్ స్వీప్

- పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్
- నేడు విజయవాడలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సమావేశం




విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సిద్ధమైన వేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా సోమవారం విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పార్టీ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షుల నుంచి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షుల వరకు 8 వేల మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. గత 53 నెలలుగా సుపరిపాలన, సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ, గ్రామానికీ, నియోజకవర్గానికీ, జిల్లాకు, రాష్ట్రానికీ చేసిన మంచిని మరింత ప్రభావవంతంగా వివరించడం.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడంపై ప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు – పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పరుగులెత్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లుగా వివరించి.. ప్రగతిపథంలో రాష్ట్రం దూసుకెళ్లాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాలని సూచించనున్నారు. ఇందుకు 'రాష్ట్రానికి జగనే కావాలి'(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన తీరుపై ప్రతినిధులకు మార్గ నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులు సీఎం సందేశాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు.

నేడు అందరి దృష్టీ కోర్టుల వైపే

- నేడు సుప్రీంకోర్టులో చంద్రబాబు క్యాష్ పిటిషన్ విచారణ
- కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు తీర్పు
- ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లోనూ హైకోర్టు తీర్పు
- ఇప్పటికే సమర్థవంతంగా వాదనలు వినిపించిన సీఐడీ




సాక్షి, న్యూఢిల్లీ /సాక్షి అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్యాష్ పిటీషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగనుంది. జస్టిస్ అనిరుద్ధాబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించనుంది. ఆరవ నంబర్ కోర్టులో ఐటమ్ 59గా ఈ పిటీషన్‌ను జాబితాలో చేర్చారు. గత విచారణ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, ఇదే కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటీషన్లపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో ఇప్పటికే చంద్రబాబుకు రెండ్రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కానీ చంద్రబాబు ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయడంతో పాటు కస్టడీలో విచారణకు ఏమాత్రం సహకరించలేదని సీఐడీ న్యాయస్థానానికి తెలిపింది. దాంతో పాటు ఈ కేసు దర్యాప్తులో తాజాగా కనుగొన్న కీలక ఆధారాలపై ఆయన్ను సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానానికి నివేదించింది. ప్రధానంగా షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాలో చేరిన అక్రమ నిధుల వ్యవహారంపై ప్రశ్నించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అందుకే చంద్రబాబును మరో మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని కోరింది. మరో వైపు చంద్రబాబు తరపు న్యాయవాదులు ఆయన్ను కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సీఐడీ తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయంగా బలవంతుడైన చంద్రబాబు ఇప్పటికే ఈ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఉదాహరణలతో సహా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను మరింతగా బెదిరించడంతో పాటు కేసు దర్యాప్తును ప్రభావం చేస్తారని వాదనలు వినిపించారు. కాబట్టి చంద్రబాబు బెయిల్ పిటీషన్ తిరస్కరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటీషన్లపై వరుసగా మూడు రోజుల పాటు వాదనలు విన్న న్యాయస్థానం రిజర్వు చేసిన తీర్పును నేడు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హైకోర్టులో బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పులు

మరో వైపు హైకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన మూడు బెయిల్ పిటీషన్లపై సోమవారం తీర్పులు వెలువడనున్నాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు, ఫైబర్ నెట్ కేసుల్లో బెయిల్ కోసం చంద్రబాబు వేర్వేరుగా దాఖలు చేసిన పిటీషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.సురేష్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు పిటిషన్లపై న్యాయమూర్తి సోమవారం తీర్పులను వెలువరించనున్నారు.

రూ.2,300 కోట్లతో.. విశాఖలో భారీ ఐటీ బిజినెస్ పార్క్

- మధురవాడ హిల్ నెంబర్–3లో 19 ఎకరాల్లో అభివృద్ధి
- ఐటీ, ఐటీ ఆధారిత, ఆర్థిక సేవా కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మాణాలు
- వీటితో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సౌకర్యాలు కూడా..
- ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం ఈక్విటీతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు
- ఈక్విటీగా ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు
- మిగిలిన రూ.1,380 కోట్లు రుణ రూపంలో సమీకరణ
- డీపీఆర్ తయారీ నుంచి నిర్వహణ వరకు భాగస్వామ్య కంపెనీదే బాధ్యత
- ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ



సాక్షి, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల ఆకర్షణలో విశాఖ నగరం ముందంజలో ఉందని ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించిన నేపథ్యంలో.. ఏపీఐఐసీ (ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) కూడా భారీ ఐటీ బిజినెస్ పార్క్‌ను ఇక్కడ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. విశాఖలో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, రహేజా గ్రూపు ఇన్‌ఆర్బిట్ మాల్‌తో పాటు ఐటీ పార్క్ ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. మధురవాడ హిల్ నెంబర్–3 మీద 18.93 ఎకరాల విస్తీర్ణంలో ఐ–స్పేస్ పేరుతో ఈ ఐటీ బిజినెస్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఐఐసీ తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ఐటీ, ఐటీ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించుకునే సంస్థలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలతో పాటు సమావేశ మందిరాలు, బిజినెస్ హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్ అండ్ బేవరేజెస్ ఫెసిలిటీలతో పాటు తగినంత పార్కింగ్ సదుపాయాలు ఉండే విధంగా ఈ క్యాంపస్‌ను సుమారు రూ.2,300 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం భాగస్వామ్య కంపెనీతో ప్రత్యేక సంస్థ (ఎస్పీవీ)ని ఏర్పాటుచేస్తారు. ఈ ఎస్పీవీలో ఏపీఐఐసీ 26 శాతం వాటాను, భాగస్వామ్య కంపెనీ 74 శాతం వాటాను కలిగి ఉంటుంది.

బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా..

ఇక మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.2,300 కోట్లలో 40 శాతం ఈక్విటీగా సమకూర్చాల్సి ఉంటుంది. ఈక్విటీ రూపంలో ఏపీఐఐసీ రూ.239 కోట్లు, భాగస్వామ్య కంపెనీ రూ.681 కోట్లు సమకూరుస్తాయి. మిగిలిన మొత్తం రూ.1,380 కోట్లను రుణ రూపంలో సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు డిజైన్ దగ్గర నుంచి నిర్మాణం, బ్రాండింగ్, నిర్వహణ అన్నీ భాగస్వామ్య కంపెనీయే చూడాల్సి ఉంటుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. బహుళజాతి సంస్థలను ఆకర్షించేలా ఈ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా చేరడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించామని, భాగస్వామ్య కంపెనీ ఎన్నిక అనంతరం నిర్మాణ పనులను ప్రారంభించి వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు.. గడిచిన ఐదేళ్లలో విశాఖ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, పలు అంతర్జాతీయ సంస్థలు, రిటైల్ సంస్థలు విశాఖలో ఏర్పాటుకావడంతో స్థిరాస్తి ధరలు 20 శాతం పైగా పెరిగినట్లు ఏపీఐఐసీ అధికారులు వెల్లడించారు. వాణిజ్య సముదాయాలకు భారీగా డిమాండ్ ఉండటంతో ఐ–స్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల వ్యక్తిత్వ హననం దారుణం

మంత్రి రోజాకు సినీనటి మీనా మద్దతు



సాక్షి, అమరావతి: మహిళలు రాజకీయాల్లో ఎదుగుతుంటే వ్యక్తిత్వ హననం ద్వారా అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని సినీ నటి మీనా అన్నారు. నీచమైన వ్యాఖ్యలు చేసినంత మాత్రాన మహిళలు భయపడి, తలుపులు మూసుకుని ఏడుస్తారనుకోవడం అవివేకమన్నారు. ఇటీవల మంత్రి రోజాపై టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలను మీనా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోలో ఖండించారు. 'కాలం మారిపోయింది. సమాజంలో మహిళలు బలమైన శక్తిగా ఎదిగారు. అభద్రతభావం, ఈర్ష్యతోనే మంత్రి రోజాను నీచంగా మాట్లాడి మహిళలపై మీకున్న కుసంస్కారాన్ని ప్రదర్శించారు' అంటూ బండారుపై మండిపడ్డారు. సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి రోజా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారని, రాజకీయాల్లోనూ తనను తాను నిరూపించుకుంటూ డైనమిక్ లీడర్‌గా గుర్తింపు పొందారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మహిళల గౌరవాన్ని కాపాడాలని మీనా విన్నవించారు.

'ఈశాన్యం'లో చల్లని కబురు

20 నాటికి ఈశాన్య రుతుపవనాల రాక!

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఒకింత నిరాశపరిచిన నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఆ ఆందోళనకు తెరదించుతూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల వల్ల రాష్ట్రంలో సాధారణం కంటే ఒకింత అధిక వర్షపాతం నమోదవుతుందని తాజాగా ప్రకటించింది. దీనిని బట్టి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలతో రబీ పంటలకు ఎంతో మేలు జరగనుంది. ఐఎండీ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాలు సాధారణానికి మించి, ఉత్తర కోస్తాంధ్రలో సాధారణంగాను వర్షాలు కురవనున్నాయి. ఈ రుతుపవనాలు రాష్ట్రంలోకి ఈ నెల 20 నాటికల్లా ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కొనసాగుతున్న సాగు నీటి విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్ట్ –2కు 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,021 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

శ్రీశైలంలో 854.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 854.2 అడుగుల వద్ద 89.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 8.684 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 17,678 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 149 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

క్రీడాకారులకు ప్రోత్సాహం

- గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు కేసీఆర్ క్రీడా కిట్లు
- జిల్లాకు 369 కిట్ల కేటాయింపు
- రాష్ట్రస్థాయి పంపిణీ జిల్లా నుంచే ప్రారంభం



మహబూబ్‌నగర్ మండలంలోని మాచన్‌పల్లి క్రీడా ప్రాంగణం

మహబూబ్‌నగర్ క్రీడలు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఔత్సాహిక క్రీడాకారులను తీర్చిదిద్దాలను ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామం, మున్సిపాలిటీ వార్డుల్లో ఎకరం స్థలంలో దాదాపు రూ.4 లక్షల నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు లాంగ్‌జంప్ పిట్, సింగిల్ వ్యాయామం బార్‌లను ఏర్పాటు చేశారు.

మహబూబ్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా..

క్రీడా ప్రాంగణాల ఏర్పాటుపై ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ అసెంబ్లి నియోజకవర్గంలో మొదటగా ప్రయోగాత్మంగా ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం విశేషం. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

జిల్లాకు 369 కేసీఆర్ క్రీడా కిట్లు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు క్రీడాకిట్లు సమకూర్చారు. 23 వస్తువులతో కూడిన కిట్లు క్రీడా ప్రాంగణాలకు అందజేయనున్నారు. రూ.50వేల విలువ గల ఈ కిట్‌లో క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్‌లో నెట్, ఫుట్ పమ్, టేప్‌తోపాటు జిమ్‌కు సంబంధించి 30 కిలోల మూడు సెట్ల డంబుల్స్, ఒకటి, రెండు కేజీల డిస్కస్త్రోలు, ఆరు టెన్నీకాయిట్ రింగ్స్, నాలుగు స్కిప్పింగ్ రోప్, మూడు విజిల్స్, స్టాప్‌వాచ్, కిట్‌బ్యాగ్‌తోపాటు క్రీడాకారులకు 75 టీ షర్టులు అందజేయనున్నారు. జిల్లాకు 369 క్రీడాకిట్లు రాగా వీటిని మండల పాయింట్ల ద్వారా అధికారులు పంపిణీ చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాలకు కిట్లు అందనుండడంతో క్రీడాకారులకు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసుకోవడానికి మంచి అవకాశం ఏర్పడింది.

జిల్లాలో రాష్ట్రస్థాయి పంపిణీ ప్రారంభం

రాష్ట్రంలోని కేసీఆర్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 3న హన్వాడ మండల కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతాకుమారి, శాట్ చైర్మన్ ఆంజనేయగౌడ్, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజ రామయ్యర్, శాట్ డైరెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు పంపిణీ చేయనున్న కిట్లు ఇవే..

క్రీడాకారులకు వేదికలా..



గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఔత్సాహిక క్రీడాకారులకు వేదికలా ఉపయోగపడుతాయి. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక దృష్టిసారించడంతో జిల్లాలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటయ్యాయి. ప్రాంగణాలకు కేసీఆర్ కిట్లు పంపిణీ ప్రారంభమైంది. మంత్రి, కలెక్టర్ ఆదేశాలతో అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తున్నాం.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

నైపుణ్యం వెలికి..



గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు కేసీఆర్ క్రీడా కిట్లు పంపిణీ చేస్తుండడం సంతోషంగా ఉంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలో క్రీడాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు స్టేడియంలు నిర్మాణమయ్యాయి. క్రీడాకిట్లతో గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులకు రెగ్యులర్‌గా ప్రాక్టీస్‌కు అవకాశం ఏర్పడింది. దీంతో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయవచ్చు.


– జగన్‌మోహన్‌గౌడ్, పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

క్షేత్రపాలకుడు.. వీరభద్రస్వామి

- నేటి నుంచి మన్యంకొండలో ఉత్సవాలు ప్రారంభం
- 10న తెల్లవారుజామున అగ్నిగుండం



వీరభద్రస్వామి మూలవిగ్రహం



మన్యంకొండలో వీరభద్రస్వామి దేవస్థానం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి ఉత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల మొదటిరోజు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అలంకరణతో పాటు అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుడతారు. ఈనెల 10వ తేదీ మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఆ రోజు అగ్నిగుండంతో పాటు పలు పూజలు నిర్వహించనున్నట్లు చైర్మన్ మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. భక్తులు ఉత్సవానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ముగిసిన అఖండదీపారాధన

దేవస్థానంలో శ్రావణమాసం 2వ సోమవారం అఖండ దీపారాధనను ప్రారంభించారు. 41 రోజుల పాటు కొనసాగించారు. అఖండ దీపారాధన ముగింపురోజు స్వామివారి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగ ంగానే ఆదివారం అఖండదీపారాధన ముగియడంతో స్వామివారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వర్గీకరణ బిల్లు కోసమే పాదయాత్ర

- మందకృష్ణ మాదిగ



చిన్నఆముదాలపాడులో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఉండవెల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అలంపూర్ నుంచి పాదయాత్రలో రెండో రోజు ఆదివారం చిన్న ఆముదాలపాడు చేరుకుని మధ్యాహ్నం భోజనం అనంతరం సాయంత్రం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును కేంద్రం నవంబర్ నెలలో శీతాకాలం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలన్నారు. లేకుంటే సుప్రీంలో కేసు త్వరలో తీర్పు వెలువడుతుందన్నారు. బిల్లును ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను అడుగగా, ఆమోదం తెలుపుతామని హామీ ఇచ్చినా ఎలాంటి నిర్ణయం రాలేదని తెలిపారు. హైదరబాద్‌కు వచ్చిన పీఎం మోదీని వర్గీకరణ బిల్లు ఆమోదం తెలపాలని కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిని, మాణిక్‌రావ్ ఠాక్రేను కూడా సంప్రదించామన్నారు. సీఎం కేసీఆర్‌కు కూడా బిల్లుపై ప్రధానికి అందజేస్తామని గతంలో తెలిపినా ఎలాంటి నిర్ణయం లేదని, రాజకీయ స్వార్థాలకే మనం పనికోస్తామా, ఉద్యమిస్తేనే బాగుపడుతామని అన్నారు. భవిష్యత్ తరాల కోసం వర్గీకరణకు అందరూ సహకరించాలని కోరారు. కంచుపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. బిల్లు ప్రవేశపెట్టేందుకే నవంబర్ 7న భారీ బహిరంగ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తక్కశీలలో బస చేశారు.

సనాతన ధర్మంతోనే అందరికీ న్యాయం

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ
- ఛత్రపతి శివాజీ రథయాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



అలంపూర్‌లో రథయాత్రను ప్రారంభిస్తున్న ఛత్రపతి శివాజీ స్ఫూర్తికేంద్రం నిర్వాహకులు, నాయకులు

అలంపూర్: సనాతన ధర్మం ద్వారానే సమాజంలో అందరికీ న్యాయం లభిస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకుడై 350 ఏళ్ల సందర్భంగా ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి క్షేత్రం నుంచి మొదటి దశ రథయాత్ర ప్రారంభించారు. సభకు డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై, జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం జయంతి సభలో ఆమె మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ హిందుత్వ, సనాతన ధర్మం కోసం పోరాటం చేశారన్నారు. హిందూ ధర్మాన్ని ముందుకు తేవడం కోసం 50 ఏళ్లలో 27 యుద్ధాలకుపైగా చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, గద్దం కృష్ణారెడ్డి, అశోక్, నాగేంద్రయాదవ్, రాజగోపాల్, ఆనంద్ తదితరులు ఉన్నారు

రథయాత్ర ప్రారంభం

మొదటి విడతగా జోగుళాంబ అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగులాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్ర నిర్వాహకులు నాగేశ్వరరావు, కృష్ణ, కిషోర్ ఆధ్వర్యంలో రథయాత్రను బీజేపీ జిల్లా అధ్యక్షుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ రథయాత్ర ద్వారా సనాతన ధర్మాన్ని ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. శివాజీ వీరత్వాన్ని యువతకు వివరిస్తామన్నారు.